క్లుప్తంగా

ఎల్‌ఓసీలు అందజేత



అలంపూర్: నియోజకవర్గంలోని ఇటిక్యాల మండలంలోని ధర్మవరం చెందిన గొల్ల సంజన్నకు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే విజేయుడు రూ. 4.5 లక్షల విలువ గల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా అయిజ మండలం ముగునోనిపల్లికి చెందిన హనుమంతు ఆపరేషన్ ఖర్చులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఇచ్చారు.

27న సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రైతువేదికలో 27న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ రాములునాయక్ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు రామాపురంలో అవగాహన సదస్సు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో కమ్యూనిటీ అవేనెస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ ప్రకటలో తెలిపారు. ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటలకు సమావేశం ఉంటుందని, గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలు అందరూ పాల్గొని పోలీసు వారు తెలిపే అమూల్యమైన సమాచారాన్ని, వివిధ చట్టాల గురించి తెలుసుకోవాలని ప్రజలను ఎస్‌ఐ కోరారు.

ధరూరు: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం సాయంత్రం 6గంటలకు అవగాహన సదస్సుకు ఎస్పీ రితిరాజ్ హాజరుకానున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రధానంగా డయల్ 100 ప్రాముఖ్యత, బాల్య వివాహాల అనార్థాలు, ట్రాఫిక్ నియమాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు చేశారు.

జనజాతర సభకు తరలిరండి

ఎర్రవల్లిచౌరస్తా: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే జనజాతర బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

మానవపాడు: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద పోతులపాడు చెందిన సుకన్యకు, కర్నూల్ జిల్లా, ఓర్వకల్లు మండలం, ఉయ్యాలవాడకు చెందిన పరశురాముడితో పదేళ్ల క్రితం వివాహమైంది. సుకన్య కర్నూల్ పట్టణంలోని సహస్ర ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తుంది. కొంతకాలంగా భర్త మద్యానికి బానిసై అప్పులు చేశాడు. ఉగాది పండుగకు సుకన్య పుట్టినిల్లయిన పెద్దపోతులపాడుకు వచ్చింది. సుకన్యను భర్త ఈ నెల 20న రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి తాను చేసిన అప్పులు చెల్లించాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని ట్యాబ్లెట్లను మింగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు వెంటనే కర్నూల్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు సోమవారం భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిప్స్ తయారీ కేంద్రంలో చోరీ

గద్వాల క్రైం: పట్టణ శివారులోని చిప్స్ తయారీ కేంద్రంలో సోమవారం చోరీ జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. ధరూర్ మండలం గార్లపాడుకు చెందిన జనార్దన్ చిప్స్ తయారీకి గాను జిల్లా కేంద్రం సమీపంలో షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు షెడ్ వెనకభాగం నుంచి లోపలికి ప్రవేశించి, రూ. 50వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటకు మేలు.. వేసవి దుక్కులు

- నకాలంలో విత్తనాలు వేసుకునే అవకాశం
- తప్పనున్న చీడపీడల బెడద
- మెరుగైన దిగుబడికి అవకాశం



కేటీదొడ్డిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

కేటీదొడ్డి: పంటకు సాగు పూర్తయ్యాక వేసవిలో భూములు ఖాళీగా ఉంటాయి. ఈ సమయంలోనే భూసారం పెరిగేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి ఉన్న భూములు తప్పా వర్షాధారంగా పండించే భూములు వేసవిలో ఖాళీగా ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసే నాటికి భూమిని లోతుగా దున్ని దుక్కులు చేసుకోవడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. దుక్కులు చేయడంతో భూమిపై పొరలు లోపలికి, లోపలి పొరలు భూ ఉపరితలంలోకి చేరుతాయి. వీటితో పంట దిగుబడి పెరుగుతుంది. వానాకాలం పంటలో తెగుళ్లు కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో చేపట్టాల్సిన పనులపై కేటీదొడ్డి వ్యవసాయ శాఖ అధికారి మహలక్ష్మి రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

అధిక దిగుబడి మార్గం..

వేసవికాలం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న చేనులో ట్రాక్టర్లు ఎద్దుల నాగళ్లతో లోతుగా దున్నాలి. సుమారు 9 అంగుళాలకు తగ్గకుండా దుక్కులు దున్నుకోవాలి. లోతు దుక్కులు దున్నినప్పుడు నేలపై పొరలో ఉండే పురుగులు, తెగుళ్లను ఆశించే పురుగులు చనిపోయే అవకాశం ఎక్కువగా ఉండడంతో పాటు నేలలో దాక్కునే క్రిమీకీటకాలు ఎండల బారినపడి నశిస్తాయి. దీంతో పంట సమయంలో పంటపై క్రిమీకీటకాల ప్రభావం తక్కువ ఉండటంతో అధిక దిగుబడి వస్తుంది. దీంతో పాటు పంట పొలంలో కలుపు నివారించుకోవచ్చు. పొలంలో ఎక్కువగా తుంగ, గరిక ఒలిపిడి వంటి కలుపు మొక్కలతో రైతులకు నష్టం ఏర్పడుతుంది. వేసవి దుక్కులు దున్నుకోవడంతో కలుపు మొక్కల వేర్లు కాయలు, దుంపలను ఏరివేస్తే మంచి ఫలితం ఉంటుంది. లోతు దుక్కులు చేసుకుంటే తొలకరి వర్షంతోనే విత్తనాలు పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పశువుల, గొర్రెల మండలు పెట్టడం

గతంలో రైతులు ఎద్దులు, ఆవులు, బర్రెలు గొర్రెలు, మేకలను రాత్రిళ్లు పొలంలో మండలు పెట్టేవారు. పశువుల మలమూత్రాలతో సేంద్రియ ఎరువుగా మారి పంటలకు ఉపయోగపడేది. దీంతో రైతులకు ఎరువు ఖర్చు తక్కువగా ఉండేది. ప్రస్తుతం పశువులు తగ్గిపోవడంతో పంటలకు సేంద్రియ ఎరువు వాడకం తగ్గిపోతోంది. ప్రస్తుతం రైతులు వేసవికాలంలో పంట చేలు, పొలాల్లో గొర్రెల మండ, బర్రెల మందను వారం పదిరోజుల పాటు ఏర్పాటు చేసుకుంటే మంచి సేంద్రియ ఎరువు లభిస్తుంది.

అవగాహన కల్పించాలి



వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి సాగులో తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేయాలి. సాగులో మెళకువలపై అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు.

– కొండయ్య, రైతు, కేటీదొడ్డి

మంచి ఫలితాలు వస్తాయి

వేసవి దుక్కులతో వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయి. లోతుగా దుక్కులు దున్నుకునేందుకు ఆసక్తి చూపాలి. దీంతో పొలంలో ఉన్న చీడపీడలు నశించి పంట దిగుబడి పెరుగుతుంది. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలి.

–మహాలక్ష్మి, ఏఓ, కేటీదొడ్డి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



పాగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: కేటీదొడ్డి మండలంలో బీజేపీ నాయకులు కృష్ణకాంత్, తిమ్మప్పగౌడు పాగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉండవెల్లి మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సోమవారం మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అయిజ మండలంలోని ఉత్తనూరులో బీజేపీ నాయకులు ఈజీఎస్ కూలీలతో మాట్లాడారు. అదేవిధంగా సింధనూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గట్టు మండలంలోని గంగిమాన్‌దొడ్డిలో నాయకులు బీజేపీ కోఆర్డినేటర్ నర్సింహులు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మైనర్లను వేధిస్తే కఠిన చర్యలు



తిమ్మాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఇటిక్యాల పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సామాజిక అంశాలతో పాటు పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేష్ ప్రజలకు ఆపదలో ఉపయోగపడే డయల్–100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలతో పాటు రైతులకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మైనర్లను వేధిస్తే పోక్సో చట్టం ద్వారా చర్యలు ఉంటాయని సూచించారు.

అందరూ కలిసికట్టుగా పనిచేయాలి



సమావేశమైన నాయకులు, కార్యకర్తలు

ధరూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి కార్యకర్త పని చేసి, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై చర్చించారు. ఇటీవల జరిగిన ఘటనను మనసులో పెట్టుకోకుండా, అందరం తల్లిలాంటి పార్టీ కోసం పని చేద్దామన్నారు. ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ అందించి గెలిపించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో హనిమిరెడ్డి, జాకీర్, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కపట్రాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన ఇటిక్యాల వాసులు



మహబూబ్‌నగర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న శంకర్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రసంగి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని యాక్తాపురం చెందిన శంకర్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. విడుదలై చిరతగలై కట్చీ పార్టీ (వీసీకే) తరపున నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం చెందిన ప్రసంగి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఆయన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆయా పార్టీల నాయకులతో కలిసి సమర్పించినట్లు తెలిపారు. ఇరువురు నాయకులు 2014, 2018, 2023 ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులుగా కూడా పోటీ చేశారు. వారి ధైర్య సాహసాలకు పలువురు మేదావులు మెచ్చుకుని వారిని అభినందించారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

మానవపాడు: మండలంలోని మద్దూరులో దేవాలయాలకు సంబంధించిన భూములను సోమవారం కౌలుకు వేలం నిర్వహించినట్లు జోగుళాంబ ఆలయ ఈఓ పురేందర్ తెలిపారు. గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 13.36 ఎకరాల భూమిని లక్ష్మీనారాయణ, రూ.1.11లక్షలకు, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 10.03 ఎకరాల భూమిని రాముడు రూ.ఏడాదికి రూ.55వేలకు, బసవేశ్వరస్వామి ఆలయానికి చెందిన 8.29 ఎకరాల భూమిని శ్రీనివాసులు రూ.90 వేలకు, ఆంజనేయ స్వామికి చెందిన 14.29 ఎకరాల భూమిని ఈశ్వర్ రూ.1.52లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, ఆచారి, రికార్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేపడుతున్నారు. సోమవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌లు, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు, మద్యం, సారా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేటప్పుడు వాటికి రశీదులను చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

సూచిక బోర్డులు లేక ఇక్కట్లు



జడుదొడ్డి, గుడుదొడ్డి మధ్య మలుపులు తిరిగిన రోడ్డు

అయిజ: మండలంలోని తూంకుంట–గుడుదొడ్డి మధ్య ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు అనేక మలుపులు తిరిగింది. రోడ్డు మలుపు తిరిగినట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు మలుపు ఉన్నట్లు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం పట్టివేత

ధరూరు: మండల కేంద్రంలోని వైన్ షాప్ నుంచి కొనుగోలు చేసి బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని మార్లబీడు చెందిన గొరంగారి వెంకటప్ప మండల కేంద్రంలోని వైన్ షాప్ నుంచి తన మోటార్ సైకిల్‌పై మద్యం తరలిస్తుండగా ధరూరు బైపాస్ రోడ్డులో పట్టుకుని, స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 6,123 ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేటీఆర్ రాకా.. హెలిప్యాడ్ పరిశీలన



అలంపూర్‌లో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

అలంపూర్: నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌరస్తాలో నిర్వహిస్తున్న సన్నాహక సభకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం వస్తున్నారు. కేటీఆర్ రాక కోసం అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం హెలిప్యాడ్ స్థలాన్ని సీఐ రవి బాబు, ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు.

ముళ్లపొదలను తొలగించిన సిబ్బంది



కాలనీ సమీపంలో రోడ్డు పక్కన తొలగించిన ముళ్ల పొదలు

సాక్షి ఎఫెక్ట్..

అయిజ: మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. ముళ్ల పొదలను తొలగించాలని సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన 'ముళ్ల పొదలను తొలగించండి' కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. సోమవారం మున్సిపల్ సిబ్బంది ముళ్ల పొదలను తొలగించారు.

మార్లబీడులో ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ



మార్లబీడులో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్తులు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: మండలంలోని మార్లబీడులో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం గ్రామస్తుల సమక్షంలో వేద పండితులు ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ, నవగ్రహాలు ఏర్పాటు పూజా కార్యక్రమాలు చేపట్టారు. అత్యంత భక్తి శ్రద్దలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గుడి, బడి తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రామంలో దేవాలయాలు ఉండడం వల్ల భక్తి భావం పెంపొందుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీరాములు, రాఘవేంద్రరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఆలయంలోకి గోవును ప్రవేశపెడుతున్న భక్తులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో కొలువుదీరనున్న ఉభయలింగేశ్వరస్వామి, వివిధ దేవతామూర్తుల వారి ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, మంత్రోచ్ఛరణల మధ్య మొదటి రోజు పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పచ్చనితోరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. హోమం, గోపూజ, గోవు ప్రవేశం కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం వివిధ పూజాకార్యక్రమాలు ఉంటాయని, బుధవారం విగ్రహాలు, ధ్వజస్తంబ ప్రతిష్ఠాపన ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు లక్ష్మిరెడ్డి, గజేందర్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, బీచుపల్లి, విశ్వనాథ్‌రెడ్డి, కలుకుంట్ల దత్త పీఠం స్వామివారు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



పచ్చర్లలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

రాజోళి: మండల కేంద్రంతో పాటు పచ్చర్లలో జొన్నల కొనుగోలు కేంద్రాలు వడ్డేపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల వేదికల్లో సోమవారం ప్రారంభించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు జొన్నలను ఈ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని పీఏసీఎస్ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం, జిల్లా మార్క్‌ఫెడ్ వారి ఆదేశానుసారం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో క్వింటాల్ రూ.3,180 ధర ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు ధీరజ్, చంద్రశేఖర్ ఆచారి, పీఏసీఎస్ సీఈఓ రవికుమార్, శ్రీనివాసాచారి, మద్దిలేటి, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేకదృష్టి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. సోమవారం మండలంలోని నాగర్‌దొడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారంను అందించడంతో పాటు వారు తీసుకుంటున్న ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు.

ముమ్మరంగా ఆర్డీఎస్ కెనాల్‌పై బ్రిడ్జి పనులు



కెనాల్ పై జరుగుతున్న పనులు

రాజోళి: భారత్‌మాల రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆర్డీఎస్ కెనాల్ డీ–24, తనగల వైపు వెళ్లే మార్గంలోని శివాలయం సమీపం గుండా భారత్‌మాల ఆరులేన్ల రహదారి వెళ్తున్న సంగతి తెలిసిందే. కాగా ఆ మార్గంలో ఆర్డీఎస్ కెనాల్ ఉండటంతో అక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా పనులు వేగంగా చేపడుతున్నారు. ఇప్పటికే స్టీల్ పనులు తుది దశకు చేరుకోగా, కెనాల్ కింది వైపున బెడ్, కాంక్రీట్ పనులు పూర్తి చేసినట్లు సిబ్బంది తెలిపారు. దీని కోసం కార్మికులు రాత్రి పూట కూడా పనిచేస్తున్నారు. రానున్న వర్షాకాలం లోగా కెనాల్ సమీపంలో పనులు పూర్తయితే, నీరు వచ్చినా ఇబ్బందులు కలగకుండా, రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

దుమ్ముతో ప్రయాణికుల ఇక్కట్లు



దుమ్ము రేగుతున్న రోడ్డుపై వెళ్తున్న ప్రజలు

అయిజ: ఆరేళ్ల క్రితం అయిజ నుంచి పులికల్ వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులు నేటికి పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. రెండు సార్లు ప్రజా ప్రతినిధులు భూమిపూజ చేశారు. కానీ రోడ్డు పనులు మాత్రం పూర్తికాలేదు. రోడ్డుపై కంకర వేసి వదిలి వేయడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేచి ప్రయాణికులకు రోడ్డు మార్గం కనిపించకుండా పోతుంది. అదేవిధంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే అనేక మందికి తీవ్రగాయాలు అయ్యాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.